

ఫిర్యాదుదారులకు నాణ్యమైన పరిష్కారం : డిఆర్ఓ

ప్రజాశక్తి - కడప : పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డిఆర్ఓ తోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఫిర్యాదుల సమస్యలను అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పని సరిగా పరిష్కరించాలని సూచించారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. వేంపల్లి మండలానికి చెందిన గంగాదేవి తమకు 0.44 సెంట్లు భూమి ఉండగా ఆన్‌లైన్‌లో నాలుగు ఎకరాల భూమిగా చూపించడంతో తన కూతురుకి తల్లికి వందనం పథకం రాలేదని పేర్కొన్నారు.

ఫీజుల దోపిడీ!




- టెన్త్ ఫీజులో 20 శాతం పెంపు
- ఇంటర్, ఇంజినీరింగ్‌కు రూ.3 లక్షలు
- క్రమబద్ధీకరణ, చెల్లింపులపై నిఘా ఏదీ
- దిక్కు తోచని స్థితిలో తల్లిదండ్రులు

ఉమ్మడి జిల్లాలో ఫీజుల దోపిడీ కొనసాగుతోంది. ప్రతి ఏటా అకడమిక్‌ఇయర్ జూన్ నుంచి ప్రారంభమవుతున్న సంగతి తెలిసిందే. పిల్లల ఫీజులు, హాస్టల్ ఖర్చులను తలుచుకుని తల్లిదండ్రులు నిలువునా వణికిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం పథకాల అమలు కంటితుడుపును తలపిస్తున్నాయి. ఫీజురీయింబర్స్‌మెంట్ ఆలస్యమైతే విద్యాసంస్థల యాజమాన్యాలు ముందుగానే ఫీజులు చెల్లించాలనే పేరుతో హాల్‌టికెట్లు, ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఇవ్వని పరిస్థితి నెలకొంది. హాస్టల్ ఫీజులు చెల్లిస్తేనే భోజనాలనే వేధింపులకు గురిచేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు వసూలు చేస్తున్న ఫీజులకు, ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు పొంతన లేకపోవడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాలు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇటువంటి కరువు సీమను ప్రయివేటు విద్య నిలువు దోపిడి చేస్తోంది. ప్రభుత్వం ప్రయివేటుకు ప్రజలను ఎరవేసి చోద్యం చూస్తోంది. ఉమ్మడి కడప జిల్లాల్లో 2,200 ప్రభుత్వ పాఠశాలలు, 950 ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1,56,156 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. 950 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సుమారు 1.40 లక్షల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేట్ విద్య వ్యాపారంగా మారింది. ఫలితంగా లక్షలాది మంది తల్లిదండ్రుల దగ్గర నుంచి రూ.లక్షలాది ఫీజులను వసూలు చేస్తుండడం పరిపాటిగా మారింది. ఎల్‌కెజికి రూ.23 వేలకుపైగా చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. ఈ ఏడాది 10వ తరగతి విద్యార్థికి 20 శాతం చొప్పున ఫీజులు పెంచేయడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది రూ.55 వేలు ఉండగా, ఈ ఏడాది ఉన్నఫళంగా రూ.65 వేలకు పెంచారు. ఐదవ తరగతికి ప్రయివేటులో రూ.28 వేలు, కార్పొరేట్‌లు రూ.40 వేల నుంచి రూ.65 వేల వరకు వసూలు చేస్తున్నాయి. దీనికి అదనంగా పుస్తకాలు రూ.16 వేలు, యూనిఫామ్స్‌కు రూ.4 వేలు, యాప్‌లకు రూ.2 వేలు చొప్పున వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈలెక్కన 10వ తరగతి నాన్ ఎసి విద్యార్థికి రూ.77 వేల రూ.90 వేల వరకు చెల్లింపులు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఎసి విద్యార్థి సుమారు రూ.లక్ష వరకు చెల్లించుకోవాల్సి వస్తోంది. ఈలెక్కన ఇద్దరు పిల్లల ఫీజులను లెక్కిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.రెండు లక్షల చొప్పున ముట్ట చెప్పాల్సి వస్తోంది. తల్లిదండ్రులిద్దరూ ఏడాది పొడవునా ఖర్చు చేసినా ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులకు అదనపు అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, పర్యవేక్షణ లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లకు పంపించాల్సి వస్తోంది. ప్రయివేటు విద్యా సంస్థల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఇంటర్, డిగ్రీ, మేనేజ్‌మెంట్, ఫార్మా స్యూటికల్ చదువులు ఖరీదైన వ్యాపారంగా మారిపోయింది. నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు పెరిగిన పోటీ నేపథ్యం ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలకు కాసుల పంట పండుతోంది. కాంపిటీషన్ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు సాధిస్తేనే సీటు లభించే అవకాశం ఉంది. లేనిపక్షంలో యాజమాన్య కోటా కింద పెద్దఎత్తున లక్షలాది రూపాయలు ముట్ట చెప్పుకోవాలి. డేస్కాలర్స్‌గా ప్రయివేటులో ఇంటర్ విద్య అభ్యసించడానికి ఏడాది రూ.1.20 లక్షలు చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. హాస్టల్‌లో చేరితే రూ.రెండు లక్షల నుంచి రూ.3.20 లక్షలు చెల్లించాలి. ఇంటర్ విద్యను పూర్తి చేసి ఇంజి నీరింగ్‌లో చేరితే హాస్టల్ ఫీజు రూ.రూ.60 నుంచి రూ.80 వేలుగా ఉంటోంది. ప్రభుత్వం ఇచ్చే ఫీజురీ యింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజులకే సరి పోతోంది. మిగిలిన డబ్బులు చేతి నుంచి చెల్లించాల్సి వస్తోంది. ఇంజినీరింగ్‌కు అదనంగా రూ. నాలుగు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించని విద్యార్థులు ఏటా రూ.నాలుగు లక్షలు చొప్పున నాలుగేళ్లకు రూ.16 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. నీట్‌లో సీటు సాధిస్తే రూ.రెండు లక్షల వరకు ఖర్చు చేయాల్సివస్తోంది. సీటు లభించకపోతే రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. మేనేజ్‌మెంట్, పార్మసీ కోర్సులకు సైతం భారీగా చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. బెస్ట్ అవైలెబుల్ పథకం అటకెక్కింది. సామాన్యుల పిల్లలకు ప్రయివేటు, కార్పొరేట్ విద్య అందని ద్రాక్షను తలపిస్తోంది. ప్రభుత్వం బెస్ట్ అవలైబుల్ పథకం అమలు గురించి చర్చించి నప్పటికీ అమలుకు నోచుకోలేదు. బడుగ, బలహీన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రయివేటు, కార్పొరేట్ సంస్థల ఫీజు వసూళ్లపై పర్యవేక్షణ కొరవడిన ఫలితంగా ఇష్టారాజ్యంగా మారింది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను క్రమబద్ధీకరించడం, ఫీజుల వసూళ్లను క్యాష్ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. ఫోన్‌పే, గూగుల్‌పే డిజిటల్ ప్లాట్‌ఫాంలో స్వీకరించాలనే నిబంధనలు అమలు చేయడం, ఇన్‌కమ్ ట్యాక్స్ దాడులు వంటి చర్యలతో పారదర్శకత ఉండడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందనే వాదన వినిపిస్తోంది.



అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వంఅంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు అంగన్వాడీకార్యకర్త, ఆయా, మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సర్క్యులర్ జారీ చేశారని, రూ.12వేల లోపు ఆదాయం ఉన్నవారికి సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల కంటే తక్కువ వేతనం అంగన్వాడీలు తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులుగా తమను గుర్తించడంతో సంక్షేమ పథకాలు అందరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగులని తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లక్ష్మీదేవి, 5వ అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు దాదాపు 13 వేల మంది ఉన్నారని పేర్కొన్నారు. వారికి రూ.15వేలు వేతనం ఇవ్వడం, పారిశుధ్య కార్మికుల కు రూ. 21 వేలు ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వాటర్, లైటింగ్, హార్టికల్చర్, టౌన్ ప్లానింగ్ వారు కార్మికులు కారా అని ప్రశ్నించారు. ప్రజలకు నిత్యం సేవలు చేయడంలో ఇంజినీరింగ్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు జీతంలో వ్యత్యాసం పెట్టి మున్సిపల్ కార్మికులకు అన్యాయం చేసిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులను ఆప్కాస్‌లో ప్రభుత్వ ఉద్యోగులు అని పెట్టి వారికి సంక్షేమ పథకాలు అమలు కాకుండా చేసిందని విమర్శించారు. అదే ఆచరణ కూటమి ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. ఆప్కాస్‌లో ప్రభుత్వ ఉద్యోగులు అని తీసేసి వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. జీవో నంబర్ 36 ప్రకారం రూ.21వేలు, రూ.24,500 ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల లోపల వారి డిమాండ్ పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలోకి పోవడమే కాకా నిరవధిక సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మిదేవి, సిఐటియు నగర అధ్యక్షులు చంద్ర రెడ్డి, మున్సిపల్ జిల్లా కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శి ఆనంద్ రావు, బ్రహ్మానంద రెడ్డి, జయపుత్రుడు, బద్రి, రామమోహన్ రెడ్డి, శ్రీకాంత్, నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

పోస్టులను కార్మికులతో భర్తీ చేయాలి

సిఇకి సిఐటియు నాయకుల వినతి



ఇఇకి వినతి పత్రం అందజేస్తున్న యుఇసిడబ్ల్యూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి ట్రాన్స్‌కోలో ఖాళీగా ఉన్న పోస్టులను పనిచేస్తున్న కార్మికులతో భర్తీ చేసి రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్ భవన్‌లో ఇఇ కృష్ణ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుఇసిడబ్ల్యూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 23,500 కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులర్ చేయాలని కోరారు. ఖాళీ పోస్టులన్నీ వాళ్లతోనే భర్తీ చేయాలని తెలిపారు. 2022 పిఆర్‌సి అరియర్స్ వెంటనే ఇవ్వాలని, కార్మికులకు గతంలో టిడిపి ప్రభుత్వం 2018లో పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న కార్మికులకు ఇన్సెంటివ్ ఇచ్చేవారని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. డిపార్ట్‌మెంట్‌కు సేవలందించిన కార్మికుడి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, ఏదైనా ప్రమాదం జరిగిన, ఆరోగ్యం బాగా లేకపోయినా అన్‌లిమిటెడ్ హెల్త్ కార్డుతో ఉచిత వైద్యం అందించాలని పేర్కొన్నారు. కార్మికుల బీమా ప్రమాదం జరిగితే కోటి రూపాయలు ఇవ్వాలని తెలిపారు. తెలంగాణలో ఇచ్చిన విధంగా ఇక్కడ అమలు చేయాలని చెప్పారు. వీటన్నింటి సమస్యల పైన ఆగస్టు 8న చలో విద్యుత్ సౌదా కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి ప్రతి కార్మికుడు కదిలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నరసింహులు, బాష, జయచంద్రారెడ్డి సాయి, సుబ్బరాయుడు, కార్మికులు ధనుంజయరాజు, నాగరాజు, రమణ, రామాంజనేయులు, రాము, రమేష్, హరికృష్ణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలి : యుఇఇయు

గ్రేడ్-2 విధులు నిర్వహిస్తున్న వారికి అసిస్టెంట్ లైన్‌మెన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలని యుఈఈయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి కోరారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019, అక్టోబర్ 2న రాష్ట్రంలోని మూడు డిస్కమ్‌లలో 7329 మంది జెఎల్‌ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లను నియమించారని తెలిపారు. ఈ ప్రక్రియ విద్యుత్ సంస్థలోని మూడు డిస్కముల నోటిఫికేషన్ల ద్వారా సాగిందని చెప్పారు. వీరి రిక్రూట్మెంట్ జరిగిన తరువాత సచివాలయం ఉద్యోగులా? లేక విద్యుత్ సంస్థ ఉద్యోగులా? అనే సందిగ్ధంలో రాష్ట్రమంతా ఉన్నప్పుడు కొన్ని సంఘాలు వీరు సచివాలయ ఉద్యోగులని సచివాలయంలోనే వినియోగించాలని తప్పుదోవ పట్టించారని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థ నోటిఫికేషన్ ఎగ్జిస్టింగ్ వేకన్సీస్ ద్వారా నియమితులయ్యారని తెలిపారు. కచ్చితంగా విద్యుత్ సంస్థ ఉద్యోగులేనని వారికి అండగా నిలబడిన ఏకైక యూనియన్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ అన్నారు. వీరందరినీ విద్యుత్ సంస్థలోని జూనియర్ లైన్‌మెన్ ఖాళీలలో నియమించారని చెప్పారు. వీరికి సంబంధించిన సర్వీస్ రిజిస్టర్లు విద్యుత్ యాజమాన్యమే చూస్తుందని పేర్కొన్నారు. వీరికి జీతాలను కూడా విద్యుత్ యాజమాన్యమే చెల్లిస్తుందని తెలిపారు. కానీ పని విభజనకు వచ్చే సమయానికి వీరిని ఇటు విద్యుత్ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగి చేస్తున్న ప్రతి పనికి, సచివాలయంలోని ప్రభుత్వ పథక కార్యకలాపాలకు వినియోగించడం వల్ల రెండు సంస్థల యాజమాన్యం ఒత్తిడి ఎక్కువైందని చెప్పారు. ఆ ఒత్తిడిని తట్టుకోలేక జెఎల్‌ఎం గ్రేడ్-2 (ఎనర్జీ అసిస్టెంట్లు) ఎంతోమంది విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి, నాయబ్ రసూల్, నాగ సుబ్బయ్య, సురేంద్ర, సుబ్బరాయుడు, మల్లయ్య పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్

- విజయం దిశగా కడప జట్టు

ప్రజాశక్తి - కడప


జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్ హోరాహోరీగా సాగుతుంది. ఈ మ్యాచ్‌లో కడప జట్టు విజయం దిశగా పయనిస్తోంది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 399 పరుగులు చేసింది. రెండవ రోజు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 31.3 ఓవర్లలో 97 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ జట్టులోని లోహిత్ కె. లక్ష్మి నారాయణ 22, ఫేక్ సిరాజ్ 22 పరుగులు చేశారు. కడప జట్టులోని చరణ్ రెడ్డి 4, శివశంకర్ 2, ఆర్థిత్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 44.1 ఓవర్లలో 169 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నాగ కుల్లాయప్ప 37 ఆర్థిత్ రెడ్డి 35 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని తేజేష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. సాయి చరణ్ 2, ప్రకాష్ రాజ్ 2 వికెట్లు తీసుకున్నారు. దీంతో కడప జట్టు చిత్తూరు జట్టుకు ఫాలో ఆన్ ఇచ్చింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ ఇన్నింగ్స్ లో ఆట ముగిసే సమయానికి 6.0 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 12 పరుగులు చేసింది.

వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన వేరొక మ్యాచ్లు నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 464 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఐదు వికెట్ల నష్టానికి 362 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 123.3 ఓవర్లలో 464 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సయ్యద్ షావుల్ హమీద్ 29, చైతన్య తేజ 72 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని నవ్నాన్ కళ్యాణ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. రేవంత్ రెండు, మహిత్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 46.1 ఓవర్లలో 171 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని గణేష్ 49, రోహిత్ 38 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని తోషిత్ యాదవ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నారు. తేజ 2, భార్గవ్ మహేష్ 2 వికెట్లు తీసుకున్నారు.

డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలని డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణ, కార్యదర్శి శీను కోరారు. సోమవారం డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు వెంకట రమణ, కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద స్కూల్ విద్యార్థులకు రూ.15వేలు, ఇంటర్ విద్యార్థుల కు రూ.15వేలు ఇస్తున్నారని తెలిపారు. డిగ్రీ విద్యార్థులకు ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. డిగ్రీ కోర్స్ పూర్తి అయినా విద్యార్థుల ఫీజు ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఫీజు బకాయిలు విడుదల చేయలేదని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యకు ప్రాధాన్యత ఇస్తూ డిగ్రీ కళాశాలల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని చెప్పారు. దీర్ఘకాలిక బకాయిలు చెల్లించి డిగ్రీ కళాశాలలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండంట్ సుబ్బారెడ్డి, మేధా నరసింహులు, సాహిత్య డిగ్రీ కాలేజ్ సంజీవ్ రెడ్డి, ఒంటిగారి సుబ్బా నాయుడు, రాజశేఖర్ రెడ్డి, సీఆర్ రెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

బడిని మా ఊర్లోనే కొనసాగించాలని ధర్నా

ప్రజాశక్తి- కడప అర్బన్

బడిని మా ఊర్లోనే కొనసాగించాలని తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్లూరు మండలం ఎస్. వెంకటాపురం రంగనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలలోని విద్యార్థులను గ్రామ సమీపంలో ఉన్నటువంటి ఎస్.వెంకటాపురం పాఠశాలకు విలీనంలో భాగంగా చేశారని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులను స్కూల్ కమిటీలకు తెలియజేయకుండా స్కూల్ టీచర్లు, ఎంఇఒలు కలిసి విలీనం చేయించారని రంగనల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ స్కూల్ తమ ఊర్లోనే కొనసాగించాలని కోరారు. అనంతరం గ్రీవెన్స్ లోని డిఇఒకు గ్రామస్తులు ఆర్జి అందజేసి స్కూల్ సమస్యలను వివరించారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం, అక్కయ్యపల్లిలోని ప్రాంతీయ బాలసాదన్ హాస్టల్ సందర్శించి విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పరిసరాలను, పరిస్థితులు, భద్రత, భద్రత ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేసవిలో పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం, సూపరింటెండెంట్, బాలసదన్ మేనేజర్, వైద్యాధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి యువత పోరు ర్యాలీ

ప్రజాశక్తి - కడప : కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీల అమలుకు సత్వర చర్యలు చేపట్టాలనివైసిపి యువజన విభాగం నగర అధ్యక్షులు దేవిరెడ్డి ఆదిత్య డిమాండ్ చేశారు. వైసిపి అధిష్ఠానం పిలుపుమేరకు సోమవారం కడప నగరంలో వైసిపి యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కడప నగరంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెకక్టరేట్ వరకు కొనసాగింది. నిరుద్యోగ భృతి ఇవ్వాలి, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ నిరుద్యోగులను గాలికి వదిలేసిందన్నారు. అధికారంలోకి రాకముందు సూపర్ సిక్స్ పేరుతో ఎన్నెన్నో హామీలు ఇచ్చి చివరకు మాటమాటలతో ముందుకు సాగడం తగదన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్ : సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులను సొంత మండలాల్లోనే బదిలీలు చేయాలని గ్రామ వార్డు సచివాలయం అన్ని కేటగిరీల సెక్రటరీలు కోరారు. సోమవారం నగరంలోని సచివాలయ ఉద్యోగులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 2019-22 వరకు తక్కువ జీతంతో పని చేశామని చెప్పారు. ఆ కాలాన్ని కూడా ఐదు సంవత్సరాల సర్వీసులో భాగంగా పరిగణించడం అన్యాయమని తెలిపారు. డిప్యుటేషన్ పేరుతో ఇప్పటికే ఒక్కో సెక్రటరీ మూడు నుంచి నాలుగు సచివాలయాల్లో పనిచేశారని పేర్కొన్నారు. ఒక మండలం నుంచి మరో మండలానికి బదిలీలు చేయాలని ప్రభుత్వం సిఫార్సు చేసిందని, పట్టణాల్లో బదిలీలు కావడం చాలా ఇబ్బందికరమని చెప్పారు. ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న బదిలీల నిర్ణయాలు తమ కుటుంబాలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. ఐదు సంవత్సరాలు పూర్తయిన వారికి ప్రమోషన్ కల్పించాకే బదిలీల అమలు చేయాలని కోరారు. నిరసనకు సంఘీభావం తెలియజేసిన మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పాలనలో సచివాలయ వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండేదని పేర్కొన్నారు. వాలంటీర్లకు రూ .10,000 వేతనం ఇస్తామని కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సచివాలయ ఉద్యోగులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

'ప్రెస్', 'పోలీస్' స్టిక్కర్లపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లాలో కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై 'ప్రెస్', 'పోలీస్' అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రెస్', 'పోలీస్' విధులతో సంబంధం లేనివారు వాహనాలపై స్టిక్కర్లను అతికించుకోవడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. సంబంధిత గుర్తింపు కార్డులు లేకుండా తిరిగే వారి వాహనాలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. కొందరు అనధికారికంగా వాహనాలకు సైరన్లు బిగించి ధ్వని కాలుష్యానికి, తోటి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తెలిసిందని, అలాంటి వాహనాలను తనిఖీలలో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

హంద్రీనీవా, వంశధారలను పూర్తి చేయాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప

రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారిన బనకచర్ల ప్రాజెక్టుపై డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి స్పందించారు. బనకచర్ల కంటే ముందు హంద్రీనీవా, వంశ దారులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాలకు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ప్రాజెక్టులను కట్టుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు విజయజ్యోతి పేర్కొన్నారు. కేంద్రంతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటామని రేవంత్‌రెడ్డి అన్నారని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్రం సహాయం తీసుకోవాలని, కానీ కొంతమంది ప్రాంతీయ ధోరణితో రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాలు రెండుగా విడిపోయినంత మాత్రాన తెలుగు వాళ్ళు శత్రువులు కాదన్నారు. ఎవరికి నష్టం లేని పద్ధతిలో పరిష్కారం చేసుకుంటే మంచిదనిన్నారు. సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, డిసిసి ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, పులివెందుల, కమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు ధ్రువ కుమార్ రెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్, కేకేసి జిల్లా ఉపాధ్యక్షులు పై రోజు హుస్సేన్, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నీలం, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్ బాష, సిద్ధిక్ పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్

నోయిడా పట్టణం, సెక్టార్18లో 400వ షో రూమును మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మలబార్ గ్రూప్ ఛైర్మన్ ఎం.పి.అహ్మద్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఇండియా ఆపరేషన్ ఎండి ఆషర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పి. వీరన్ కుట్టి, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సలీం మాథ్యూ, రిటైల్ ఆపరేషన్ హెడ్ పి.కె.సిరాజ్, రీజనల్ హెడ్ ఎన్.కె. జిషాద్, మేనేజ్‌మెంట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసులరెడ్డి

మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సింహాద్రిపురం ఎంపిడిఒగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన పులివెందుల నుంచి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి పులివెందులకు బదిలీ అయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి మొదటి ప్రాధాన్యతగా అత్యవసర పనులు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజల అవసరాల మేరకు తాగునీరు, డ్రెయినేజీ, ఇతర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. స్థానిక అధికారులు ఆయనతో సమస్యలను వివరించారు.

ప్రొద్దుటూరు ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న గడ్డం రాజు

ప్రొద్దుటూరు మండల విద్యాశాఖ అధికారి సావిత్రమ్మపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ యూని యన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు డిమాండ్ చేశారు. స్థానికంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో చట్టాలు అమలు కావడం లేదన్నారు. చట్టాలు అమలు పరచాల్సిన మండల విద్యాశాఖ అధికారి ఆయా యజమానులతో కుమ్మక్కై వాటికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. నర్సరీ, యుకెజి, ఎల్‌కెజిలకు అనుమతులు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ మేరకు సోమవారం ఎంఇఒ సావిత్రమ్మకు వినతి పత్రమివ్వగా.. ఆమె నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారని తెలిపారు. ఆరేళ్లగా ఇక్కడే ఎంఇఒగా విధులు నిర్వహిస్తున్నారని, యాజమాన్యాలతో పరిచయాలు పెంచుకొని ఆర్థికంగా సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. గతంలో కూడా అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు.

నేడు చాపాడు మండల సమావేశం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి టి.లక్షుమయ్య అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ పూర్తి నివేదికతో హాజరుకావాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు గ్రామాల్లో గుర్తించిన సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరుకావాలని, వారి కుటుంబ సభ్యులు, ఇతరులకు ప్రవేశం లేదని తెలిపారు. అధికారులు ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరు అయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ పేర్కొన్నారు.



విద్యార్థులకు కిట్స్ అందిస్తున్న గంగాధర్, బాల ఓబులరెడ్డి

పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే సర్కారు ధ్యేయమని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె గంగాధర్ అన్నారు. సోమవారం పుల్లూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ స్టూడెంట్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్సీ ప్రకటించిందని, ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాల ఓబులరెడ్డి, పాఠశాల చైర్మన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గండి ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలోని పుణ్య క్షేత్రమైన గండి క్షేత్రంలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ పునప్రతిష్ఠ, శ్రావణ మాసోత్సవాల ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగంతో గండి ఆలయ అధికారులు సమావేశం ఏర్పాటు చేయాలని గండి క్షేత్రం ఛైర్మన్ కావలి కృష్ణతేజా కోరారు. ఆ మేరకు సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడుకు వినతిపత్రమిచ్చారు. శ్రావణమాసంలో కనీసం 10 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారని వివరించారు. భక్తులకు మూలవిరాట్ దర్శన భాగ్యం కలిగేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధన

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను సోమవారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడుతూ త్యాగరాజ స్వామి కర్నాటక, శాస్త్రీయ సంగీతానికి మూలస్తంభమన్నారు. త్యాగయ్య భూలోక నారద మహర్షి అని కీర్తించారు. శ్రీరామునికి నిజమైన భక్తుడు అన్నారు. భక్తిలో ప్రహ్లాదుడు, వైరాగ్యంలో శుక్రుడు, గానంలో నారదుడు, సాహిత్యంలో విద్యావతి వంటి వాడు త్యాగయ్య అని తులసిరెడ్డి కొనియాడారు. 24 వేల కృతులు రచించారని చెప్పారు. 205 రాగాలు సృష్టించారని తెలిపారు. తెలుగు భాషకు త్యాగరాజ స్వామి వన్నె తెచ్చారని వివరించారు. సంగీత సాధన ద్వారా మోక్ష ప్రాప్తి పొందాడని తెలిపారు. సంగీత, సాహిత్య రసజ్ఞుల హృదయాలలో త్యాగయ్య చిరంజీవిగా ఉన్నారని తులసిరెడ్డి అన్నారు. అనంతరం త్యాగరాజ కమిటి సభ్యులు తులసిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రత్నమయ్య, రామకృష్ణ, రామాంజనేయులు, రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేష్, కాంగ్రెస్ నేతలు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రాజు, మాబు పాల్గొన్నారు.



తులసిరెడ్డిని సత్కరిస్తున్న త్యాగరాజ ఆలయ కమిటీ సభ్యులు

కూలి ఇవ్వాలని 'ఉపాధి' కూలీల నిరసన

కూలి వేసేందుకు టెక్నికల్ అసిస్టెంట్ లంచం డిమాండ్ చేశాడంటున్న కూలీలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణయ్య

మండలంలోని కదిరివారిపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు కూలి డబ్బులు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ తాము 50 రోజులు ఉపాధి హామీ పనికి వెళ్లామన్నారు. తమకు చెందిన మూడు గ్రూపులలో 60 మంది కూలీలు పనిచేశారన్నారు. అయితే ఆ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్ వారానికి ఒక్కరోజు మాత్రమే పని చేశారని అంటున్నాడని పేర్కొన్నారు. పూర్తిగా కూలి డబ్బులు వేయాలంటే గ్రూప్‌నకు రూ.10వేలు లంచం ఇవ్వాలని అడిగాడని తెలిపారు. మిగతా గ్రూపుల వారు లంచం ఇవ్వడంతో వారి ఖాతాలో కూలి పడ్డాయని టెక్నికల్ అసిస్టెంట్ పేర్కొన్నాడని తెలిపారు. తమ కూలి డబ్బులు తమకు వేయాలని ఎంపిడిఒ వెంకటరమణయ్యను కోరారు. పని చేసిన చోట కొలతలు వేసి తమకు వచ్చినంతనే కూలి చెల్లించాలని వారు కోరారు. ఇందుకు స్పందించిన ఎంపిడిఒ మాట్లాడుతూ సంబంధిత ఉపాధి హామీ అధికారులను ఫీల్డ్‌లోకి పంపించి మళ్లీ కొలతలు వేయించి, పని చేసిన మేరకు కూలి డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కూలీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మండల వ్యాప్తంగా 2,600 మంది ఉపాధి హామీ కూలీలున్నారు. నెలకు 2,300 మందితో పని చేయించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఎపిఒ గంగాభవాని తెలిపారు. పి.వెంకటాపురం, మాలెపాడు, చిన్నదండ్లూరు, హనుమనగుత్తి భూములలో మైలవరం కాలువ నీళ్లు వచ్చాయని తెలిపారు. అక్కడ పనులు జరగడం లేదన్నారు. అందువలన ప్రస్తుతం 960 మంది మాత్రమే పనులు చేస్తున్నారని ఎపిఒ వివరించారు. ఇంజినీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు పనులను పర్యవేక్షించి కొలతలు ఇస్తారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రూ.307 ఒకొక్కరు చేయాల్సిన పనిని వీరు కొలత వేసి ఇస్తారన్నారు. కూలీలు తక్కువ పని చేస్తే డబ్బులు తక్కువ చెల్లిస్తాంన్నారు. కూలీలకు ఎలాంటి అన్యాయం జరగని వ్వబోమని ఎపిఒ తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సిపిఎం



స్టిక్కర్లను అతికిస్తున్న శివ నారాయణ, కొండయ్య

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికల హామీలలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని.. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించండి అని చెప్పి, నేడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి వసూలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ, సిపిఎం మైలవరం మండల నాయకులు కొండయ్య తెలిపారు. ఆ మేరకు సోమవారం సిపిఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన స్మార్ట్ మీట్లను వ్యతిరేకించండి అనే స్టిక్కర్లను వేపరాల గ్రామంలో ప్రతి ఇంటికి అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయినా ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలలో చాలా వాటిని అమలు చేయలేదన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టబోమని చెప్పి విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నారని విద్యుత్ ఛార్జీలు పెంచబోమని నమ్మ పలికి నేడు మోయలేని భారాలు ప్రజలపై వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని, విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపవద్దని కోరారు. లేకుంటే రాష్ట్ర ప్రజలు ఏ స్థాయిలో భారీ మెజార్టీ ఇచ్చారో ప్రతిపక్ష పార్టీకి ఇచ్చిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ రాయుడు, పల్లా లక్ష్మీనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని సుందరయ్య భవనంలో సోమవారం స్మార్ట్ మీటర్ల స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన పిలుపును మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలపై రెండుసార్లు విద్యుత్ ఛార్జీల భారం దాదాపు రూ.15,454 కోట్లు మోపారని, ఇది దుర్మార్గమని పేర్కొన్నారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేయడానికి అవసరమైన క్లాజు ఉందని, విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నా దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు వెంటనే ఆపాలని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానాన్ని ఉపసం హరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్, మండల కమిటీ సభ్యులు సాలా గోవింద్, హరి, సుబ్బమ్మ, అజయ్ పాల్గొన్నారు.



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివకుమార్

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. 2025-26 కార్యవర్గం ప్రమాణ స్వీకార ఉత్సవానికి ముఖ్య అతిథులుగా రోటరీ ఇంటర్నేషనల్ 3160 గవర్నర్ డాక్టర్ సాధు గోపాలకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ మల్లికార్జున, రోటరీ ట్రస్ట్ ప్రెసిడెంట్ కోటా శివకుమార్ 2025 -26 సంవత్సరానికి బ్లూ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి షేక్ బాబా, కోశాధికారి గొంతు బాలాజీ ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ సేవా సంస్థ రోటరీ ద్వారా విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న సేవా సంస్థ ఇందుకు ఉదాహరణ అన్నారు. మన ప్రొద్దుటూరులోని రోటరీ హాస్పిటల్‌లో ప్రతినెల 300కు పైగా నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తున్నారన్నారు. ఇలాంటి సేవలు 200పైగా దేశాలలో జరుగుతున్నాయన్నారు. రోటరీలో సభ్యులుగా చేరి సమాజసేవలో భాగస్వాములు అవ్వాలని కోరారు. 2024-25 ప్రెసిడెంట్ టి. బాల సూర్యారావు, సెక్రెటరీ జి శ్రీధర్ శర్మ చేసిన సేవలను కొనియాడారు. రోటరీ అనేక సేవా కార్యక్రమాల ద్వారా రోటరీ క్లబ్ మంచి పేరు తెచ్చారని అభినందించారు. కార్యదర్శి శ్రీధర్ శర్మ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి వారు చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. 2025-26 కమింగ్ ప్రెసిడెంట్ షేక్ బాబా, కోశాధికారి గొంతు బాలాజీ మాట్లాడుతూ ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ సభ్యులందరి రోటరీ ట్రస్ట్ కార్యవర్గం సహకారంతో ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ సేవలను విస్తృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రోటీరియన్లు డాక్టర్ లక్ష్మీనరసయ్య, డాక్టర్ జి.రామ్‌మోహన్‌రెడ్డి, వంకధార నరసింహారావు, జాకీర్హమద్, ఎండి అయూబాఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ నాగరాజు

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి నాగరాజు సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభల సం దర్భంగా సెమినార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండా లన్నారు. సామాజిక మాధ్యమాలకు వీలైనంత దూరంగా ఉండాలని సూచిం చారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, రవి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

దోమకాటు ఆరోగ్యానికి చేటు అని కోరుకుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి స్రవంతి, ప్రత్యూష పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు దోమకాటు వల్ల కలిగే వ్యాధులు, ముఖ్యంగా మలేరియా, డెంగీ వాటిపై వివరించారు. దోమల వృద్ధిని అడ్డుకునే మార్గాలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచే విధానాలు, నీటి నిల్వలను తొలగించడం, దోమ తెరల వాడకంపై అవగామన కల్పించారు. ప్రత్యేకంగా గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఇలాంటి వ్యాధులకు అత్యధికంగా గురవుతారని తెలిపారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి ఖాదర్ బాషా, హెల్త్ సూపర్వైజర్ ఖలీల్ బాషా, పద్మావతమ్మ, రాధ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట



తహశీల్దార్‌ను కలిసిన వైసిపి నాయకులు

రైతులు భూ సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటున్నారని, వాటిపై దృష్టి పెట్టి పరిష్కారానికి చొరవ చూపాలని వైసిపి నాయకులు కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం వారు తహశీల్దార్ ఎవి రమణమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు భూ సమస్యలను ప్రస్తావించారు. తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ పివి రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీ మోహనరెడ్డి, కెసి కెనాల్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అమరేశ్వర రెడ్డి, వేమారెడ్డి, అంబటి శివారెడ్డి, ఏనుగు శివారెడ్డి పాల్గొన్నారు.



ఆర్‌డిఒ చిన్నయ్యకు వినతిపత్రం అందిస్తున్న వార్డు, సచివాలయ సిబ్బంది

జిఒ 5ను రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ బదిలీల్లో విడుదల చేసిన జిఒ నంబర్ 5ను రద్దు చేయాలని సచివాలయ సిబ్బంది కోరారు. ఆ మేరకు వారు సోమవారం ఆర్‌డిఒ చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రాముడుకు వినతిపత్రాలచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ స్థానిక మండలంలో ఉద్యోగం చేయకూడదనే నిబంధన ఈ జిఒలో ఉందన్నారు. దీనివల్ల సచివాలయ సిబ్బంది తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. మున్సిపాలిటీల విషయంలో మున్సిపాలిటీని యూనిట్‌గా తీసుకోకుండా సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకొని అయిదేళ్ల ఉద్యోగ కాలం పూర్తి చేసుకున్న వారికి అదే మున్సిపాలిటీ పరిధిలోనే ఒక సచివలాయం నుండి మరొక సచివాలయానికి బదిలీలు చేపట్టాలని వినతి పత్రంలో సూచించారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు ప్రసాద్

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగులో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. సమస్యను అధికారులు గుర్తించి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యార్థులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన పత్రాల కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ముద్దనూరు రోడ్డు సచివాలయం, బ్యాంకు, పోస్టాఫీసులో ఉండేదని, ఇప్పుడు సర్వర్లు పని చేయపోవడంతో పెద్ద ముడియం వంటి సుదూర గ్రామానికి వెళ్లవలసి వస్తోందన్నారు. ప్రజలకు, విద్యార్థులకు రవాణా ఖర్చు, సమయం వృథా అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, యాసిన్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని నాగులగట్టుపల్లెకి చెందిన ముబారక్ కుటుంబానికి టిడిపి మండల కన్వీనర్ తాళ్లపల్లె మహేశ్వర్‌రెడ్డి ఆర్థిక చేయూతనిచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల సురభి నాగులగట్టుపల్లెకి చెందిన ముబారక్ బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ ఎయిర్ పోర్ట్‌లోనే గుండె పోటుతో మృతి చెందాడు. ముబారక్ కుటుంబ ఆర్థికంగా ఇబ్బందులు పడడంతోపాటు బెంగళూరులో ఇంజినీరింగ్ 3వ సంవత్సరం చదివే ఆయన కుమారుడు ఆర్థిక సమస్యతో చదువును ఆపేసి ఇంటి వద్దనే ఉండిపోయాడు. విషయం తెలుసుకున్న మహేశ్వర్‌రెడ్డి వెంటనే కళాశాల యాజమాన్యంతో మాట్లాడి పెండింగ్ ఫీజు రూ.75,000 తక్షణం చెల్లించారు. ఆర్థికసాయం చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మహేశ్వర్‌రెడ్డి కుటుంబానికి తాము జీవితాంతం రుణపడి ఉంటామని ముబారక్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

చిలుకల ఆకారంలో మామిడికాయలు

ప్రజాశక్తి - చక్రాయపేట



మండలంలోని ముద్దప్పగారి పల్లెలో రైతు మూలంరెడ్డి సిద్ధారెడ్డి మామిడి తోటలో పంచ దార చిలుక ఆకారంలో రెండు మామిడి కాయలు దర్శనమిచ్చాయి. సోమవారం తోటలోకి వెళ్లిన రైతు సిద్దారెడ్డికి పంచ దార చిలుక ఆకారంలో ఉన్న రెండు మామిడి కాయలు ఒక చెట్టుకే కనబడ్డాయి. వీటిని చూసేందుకు చుట్టు పక్కల ఉన్న రైతులు తరలి వచ్చారు. ముక్కు, తోక, రూపం కలిగి ఉండడంతో ఆసక్తిగా మామిడి కాయలను ప్రజలు తిలకించారు. చూసినవారు చాలా అందంగా ఉన్నాయని చర్చించుకున్నారు.